# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 155 | విశాఖపట్నం | 7-3-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 155 | VISAKHAPATNAM | 7-3-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ - PATHAKAM NEWS TELEGU DAILY - తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## ఏపీలో 13 ఏళ్ల లోపు పిల్లలకు

# సోషల్ మీడియా నిషేధం: చంద్రబాబు

- **90 రోజుల్లోగా చర్యలు చేపడతామన్న చంద్రబాబు**
- **13 నుంచి 16 ఏళ్ల వయసు వారిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వెల్లడి**
- **జాతీయ స్థాయిలోనూ పాలసీ తేవాలని కోరిన టీడీపీ**



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. (తరువాయి 2వ పేజీలో)

## వైసీపీకి 11 మంది సభ్యులున్నా.. 1100 మంది లాగా మాట్లాడుతున్నారు: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్లు ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బడ్జెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని (తరువాయి 2వ పేజీలో)



2లో

## ఎమ్మెల్సీ బొత్సకు మరోసారి అస్వస్థత

## రాత్రిపూట సరిగ్గా నిద్ర పట్టడం లేదా?



6లో



4లో

## హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు ఆటంకం కలిగించం: ఇరాన్

## పుణ్యక్షేత్రాల ప్రతిష్టను దిగజార్చుతున్న కూటమి నేతలు: రోజా



**భీమవరం, పతాకం న్యూస్:** ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుమల, శ్రీశైలం, అన్నవరం వంటి ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల ప్రతిష్ఠను కూటమి నేతలు దిగజార్చుతున్నారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం దేవుడిని, ఆలయాల ప్రతిష్ఠను వాడుకోవడం తగదని హితవు పలికారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వస్తున్న ఆరోపణలు అసత్యమని, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

## ఏపీలో రూ.6వేల కోట్లతో కొత్త సబ్ స్టేషన్లు: గొట్టిపాటి



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.6వేల కోట్లతో పనులు చేపట్టినట్లు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, కోళ్ళ లలిత కుమారి, ముత్తుముల అశోక్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో జిల్లా విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 200కు పైగా 33/11 కేవీ సబ్ స్టేషన్లు అవసరం ఉందని గుర్తించి, వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. విజయనగరం వేణుగోపాలపురం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రస్తుతం రీటెండరింగ్ దశలో ఉన్నాయని, 2027 మార్చినాటికి పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో రూ.46కోట్ల వ్యయంతో 220కేవీ, 132కేవీ లైన్ల పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరలో చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వేణుగోపాలపురంలో రూ.77కోట్లతో సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి సభకు వివరించారు. విజయనగరంలో కూడా విశాఖపట్నం తరహాలో అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరగా, ఆ వ్యవస్థ ఖర్చుతో కూడుకుందని మంత్రి తెలిపారు. నిధుల లభ్యత, అవసరాన్ని బట్టి ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

## 2024-25లో జాతీయ పార్టీల ఆదాయంలో బీజేపీ టాప్.. రూ.6769.14 కోట్ల ఆదాయం




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** 2024-25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీలలో బీజేపీ అత్యధిక ఆదాయాన్ని నివేదించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. దేశంలోని ఆరు జాతీయ పార్టీలకు ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.7,960.09 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపింది. ఇందులో 85.03 శాతం వాటా బీజేపీ ఖాతాలోకి వెళ్లినట్లు పేర్కొంది. ఎన్నికల సంఘానికి ఆయా పార్టీలు సమర్పించిన ఆడిట్ నివేదికల ఆధారంగా ఏడీఆర్ ఈ లెక్కలను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి రూ.6769.14 కోట్ల ఆదాయం సమకూరింది. 918.28 కోట్ల ఆదాయంతో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది.

## కాకినాడ జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ షాపు యజమానుల భారీ ధర్నా



**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తున్న దృశ్యాలు ఒక పక్క, మరో పక్క జనం చర్చలు ఎందుకు అలా పని పాటు లేదా అని జనం ఆరా తీస్తున్న సమయంలో ఓ మెడికల్ షాపు యజమాని ముచ్చట్లు.... వివరాల్లోకి వెళితే డ్రగ్ అధికారులు దాడులకు తట్టుకోలేక రోడ్డు మీదకు వస్తున్న మెడికల్ షాప్ యజమానులు. అవినీతి,అక్రమాలుకు పాల్పడుతూ మెడికల్ షాప్ యజమానిలని పట్టిపీడించి భయభ్రాంతులకు గురి చేస్తూ, అక్రమ కేసులు వేసి లైసెన్సులు రద్దు చేస్తామని బెదిరిస్తున్న కాకినాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అని రోడ్డెక్కిన మెడికల్ షాపు యజమానులు. డ్రగ్ అధికారులు దాడులు నుండి విముక్తి కలిగించాలని రోడ్డెక్కి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలోని విశాఖ జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్ అరాచకాలు తట్టుకోలేక మెడికల్ షాపు యజమానులు ఫిర్యాదులు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం తలుచుకొని హెడ్ ఆఫీస్‌కి ఆటాచ్ చేసి పంపించిన సందర్భాలు ఉన్నాయి. ఇదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ అధికారులు దాడులు, అరాచకాలు ఇట్లాగే ఉన్నాయని.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. అక్రమ కేసులు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు అని రాష్ట్రవ్యాప్త చర్చికి దారితీస్తున్నాయి.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### అప్రమత్తం..

సైబర్ నేరగాళ్లు అక్రమ మార్గాల్లో డబ్బును దోచుకోవడానికి అనేక విధానాలను అన్వేషిస్తారు. అందులో ప్రధానమైనది డిజిటల్ అరెస్ట్. కేవలం ఎదుటివారిని బెదిరించడం ద్వారా వారి నుంచి డబ్బును సాధ్యమైనంత వరకు దోపిడీ చేయడమే వీరి లక్ష్యం. సైబర్ నేరాలు ఏ రకానికి చెందినప్పటికీ వాటికి గుర్రై మోసపోతున్నామంటే కేవలం బాధితుల ఆలోచనల్లో తప్పిదాలే అని చెప్పవచ్చు. ఎవరో ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ చేస్తామని చెప్పడంతో బెదిరిపోవడం, మరొకరు బ్యాంక్ అకౌంట్లు, ఓటిపీలు చెప్పాలని కోరడంతో వారికి ఆయా వివరాలు ఇవ్వడం వంటివి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. స్టాక్ఎక్ఛేంజిలో డబ్బు పెడితే పది రెట్లు ఇస్తామని చెప్పడంతో మరికొందరు ఈ మోసాలకు బలి అవుతున్నారు. అసలు అది సాధ్యమేనా అని కొంతైనా ఆలోచన చేయకుండా మోసపోతున్నారు. ముందుగా సైబర్నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. డిజిటల్ అరెస్ట్ గురించి పరిశీలిస్తే అసలు అలాంటి ప్రక్రియ పోలీసు విభాగంలో లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు శాఖలోని వివిధ విభాగాల అధిపతులు, సైబర్ నిపుణులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్ రాగానే భయపడి లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు వారికి ముట్టజెబుతున్నారు. మీ ఆధార్ నెంబరు నుంచో, బ్యాంక్ అకౌంట్ నుంచో అక్రమ లావాదేవీలు జరిగాయని సైబర్నేరగాళ్లు ఫోన్ చేయగానే నిజమని నమ్ముతున్నారు. తాము అలాంటివి చేయలేదని ఆధారాలు చూపించాలని అడగాల్సిన బాధ్యత బాధితులపై ఉంది. అంతేకాకుండా విదేశాల నుంచి తమ పేరుపై ఒక పార్శిల్ వచ్చిందని, అందులో కోట్ల రూపాయల డ్రగ్స్ ఉన్నాయని సైబర్నేరగాళ్లు చెబుతారు. తమకు ఈ లావాదేవీలతో సంబంధం లేదని, విచారణకు ప్రత్యక్షంగా హాజరై వివరణ ఇస్తానని చెప్పే కనీస జ్ఞానాన్ని కోల్పోతున్నారు. దీనితో సైబర్ నేరాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. ఒకసారి గత మూడేళ్లుగా జరిగిన డిజిటల్ అరెస్టును పరిశీలిస్తే ఎంత పెద్ద సంఖ్యలో మోసపోతున్నారన్న విషయం అర్థమవుతుంది. 2022లో 39,925 కేసులు నమోదు అయ్యాయి. సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి 91.14 కోట్ల రూపాయలు కాజేశారు. 2023లో సుమారు 500 కోట్లు సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు, మొత్తం సైబర్ క్రైమ్ ? 86,4205 . 202455 1,23,672 కేసులు నమోదు కాగా సుమారు 1,935.51 కోట్ల రూపాయలు నేరగాళ్లు వసూలు చేశారు. ఈ సంఖ్య ప్రతి రోజూ పెరుగుతూనే ఉంది. అసలు డిజిటల్ అరెస్ట్ అన్న పదం, ప్రక్రియ భారత నేరస్మృతి చట్టంలో లేదని చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇది సైబర్నేరగాళ్లకు వరంగా మారింది. దీనితో దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ తరహా సైబర్ నేరాలను లోతుగా దర్యాప్తు చేసేందుకు వివిధ దర్యాప్తు సంస్థల ప్రతినిధులతో కూడిన ఒక ఉన్నత స్థాయి మల్టీ ఏజెన్సీ ప్యానెల్ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టులో ఈ అంశంపై విచారణ జరగడానికి కొన్ని రోజుల ముందే కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీకి స్పెషల్ సెక్రటరీ అధ్యక్షత వహించనున్నారు. ఈ కమిటీలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ. ఢిల్లీ పోలీసు విభాగాలకు చెందిన ఇన్స్పెక్టర్ జనరల్ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్, విదేశీ వ్యవహారాలు, ఫైనాన్స్, లా అండ్ జస్టిస్ మంత్రిత్వ శాఖల నుండి జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులు, భారతీయ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ సభ్యులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు కూడా ఇందులో భాగస్వామ్యం వహిస్తారు. అదేవిధంగా డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ నేరగాళ్లు ఉచ్చు బిగించిన వెంటనే బాధితులు పోలీసులను ఆశ్రయిం చేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ను కూడా ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

## దుగరాజపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నెల్లూరు జిల్లా దుగరాజపట్నం వద్ద ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో కూడిన షిప్ బిల్డింగ్ హెవీ ఇండిస్టీస్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సాధారణ పరిపాలనా విభాగం అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును ఒక ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థ (ఎస్పివి)గా అభివృద్ధి చేయనున్నారు. సుమారు రూ. 29,662 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సంయుక్తంగా 50:50 నిష్పత్తిలో నిర్వహించనున్నాయి. ఏడాదికి 1.2 మిలియన్ గ్రాస్ టన్నేజ్ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని ఈ కేంద్రం కలిగి ఉంటుంది. ఈ సమగ్ర సముద్ర పరిశ్రమ కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాలుగు భారీ డ్రై డాక్స్, అత్యాధునిక షిప్ లిఫ్ట్ సదుపాయాలు, మరియు భారీ యంత్రసామగ్రి తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కేవలం నౌకా నిర్మాణమే కాకుండా, అనుబంధ పరిశ్రమల ద్వారా అదనంగా రూ. 8,000 నుండి రూ. 10,000 కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది.

## కర్ణాటకలో 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం



**కర్ణాటక:** కర్ణాటక ప్రభుత్వం ఒక చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా(రాశీఎఖుశ్రీ ఎవఎఖు) వాడటాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం శాసన సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ను ప్రవేశపెడుతూ ఈ ప్రకటన చేశారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకం వల్ల పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను అరికట్టడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సిద్ధరామయ్య మాట్లాడుతూ..'పిల్లలకు సోషల్ మీడియా ఒక వ్యసనంలా మారుతోంది. దీంతో మానసిక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఒంటరిగా ఉండేందుకే ఆసక్తి చూపిస్తున్నారు, తల్లిదండ్రులతో సమయాన్ని గడప లేకపోతున్నారు. 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాపై నియంత్రణ అవసరం అని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే కర్ణాటక ప్రభుత్వం కూడా 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది' అని అన్నారు.

## ఎమ్మెల్సీ బొత్సకు మరోసారి అస్వస్థత



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్లోకి రాకపోతే హాస్పిటల్కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం.

## అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో వందలాది చిన్నారులు మృతి: యూనిసెఫ్ ఆందోళన

**ఇరాన్:** అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో వందల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. గత నెల 28న ప్రారంభమైన యుద్ధం నేటితో ఏడవ రోజుకు చేరుకున్నది. ఈ యుద్ధంలో అత్యధికంగా ఇరాన్లో చిన్నారులు చనిపోయినట్లు తెలిపింది. ఇరాన్లో 181 మంది, లెబనాన్లో 7గురు, ఇజ్రాయెల్లో ముగ్గురు, కువైట్లో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించింది. యుద్ధాలను పిల్లలు ప్రారంభించరని కానీ వారు కూడా మూల్యం చెల్లించుకుంటున్నారని పిల్లల హక్కులు, ఆరోగ్యం, విద్య, సంక్షేమం కోసం పనిచేసే ఈ ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ ఆవేదన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త ఆపరేషన్లో మొదటి రోజు ఇరాన్లోని మినాబ్లో ఒక బాలికల పాఠశాలపై దాడి జరగగా, 160 మంది చిన్నారులు మృతి చెందినట్లు ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది.

## చంద్రబాబుకు పోస్టు కార్డులు పంపిన సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థినులు



**కర్నూలు, పతాకం న్యూస్:** సాంఘిక సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థులు కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంజయ్ శశిధర్ తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ .... ఎస్ఎఫ్ఐ పోస్ట్ కార్డు ఉద్యమానికి శ్రీకారంలో భాగంగా శుక్రవారం ఆదోని ప్రభుత్వ బాలికల హాస్టల్ లో విద్యార్థులు సిఎం చంద్రబాబుకు పోస్ట్ కార్డులు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు రూ.3000 కు పెంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్కు, వాచ్మెన్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. అద్దె భవనాల్లో హాస్టల్ నడుస్తున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి సంవత్సరం సంక్షేమ హాస్టల్లో అభివృద్ధి కోసం నిధులు కేటాయించి మరమ్మతులు చేయించాలని, మరుగుదొడ్లు స్నానపు గదులు తాగునీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, జగన్, మహేష్, ఈరన్న, శీను పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## సోషల్ మీడియా నిషేధం: చంద్రబాబు

స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నీస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6-7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## వైసీపీకి 11 మంది ఉన్నా.. 1100 మంది లాగా మాట్లాడుతున్నారు: పవన్

పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో జరిగిన 'ఆర్థిక విధ్వంసం' కారణంగా రాష్ట్రం దాదాపు 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని ఆయన కొనియాడారు. ఇన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, సామాజిక భద్రతా పెన్షన్ల కోసమే రూ. 33 వేల కోట్లు కేటాయించడం సీఎం చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయమని ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో అనాలోచిత విద్యుత్ కొనుగోళ్ల వల్ల డిస్కంలకు రూ. 12,250 కోట్ల నష్టం వాటిల్లిందని, విద్యుత్ సంస్థలు రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ట్రూడౌన్' పేరిట ఛార్జీలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించామని పవన్ చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల అప్పులను, రూ. 35 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని విమర్శించారు. ఇందులో ఇప్పటికే రూ. 25 వేల కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడం వల్ల రూ. 8,700 కోట్ల కేంద్ర నిధులు నిరుపయోగమయ్యాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటాయించి ఇంటింటికీ మంచినీరు అందించే ప్రాజెక్టును వేగవంతం చేస్తోందని వివరించారు. "నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదు.. భావితరాల కోసం" అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తిని ఉటంకిస్తూ, బడ్జెట్లో భావితరాల బాగు కోసం సీఎం చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.

# పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై వీఎంఆర్డీఏ కమిషనర్ సమీక్ష

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం సిఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సందర్భంగా పర్యాటక రంగంలో కుదుర్చుకున్న 43 ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలని మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఈ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పర్యాటక ప్రాజెక్టుల స్థాపనలో ఎదురవుతున్న అడ్డంకులను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అధిగమించాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో నిర్మాణాలకు సంబంధించి నేవీ, ఎయిర్‌పోర్స్ అథారిటీ, జివిఎంసి వంటి సంస్థల నుండి రావాల్సిన అనుమతులు సత్వరమే మంజూరయ్యేలా చేసి, పెట్టుబడిదారులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి మాధవి, జివిఎంసి, యుసిడి, కెపిఎంజి కన్సల్టెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## అంధుల పాఠశాలలో సేవా కార్యక్రమాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో సాగర్ నగర్‌లోని అంధుబాలికల పాఠశాలలో గీతం ఆర్కిటెక్చర్ డీన్, డైరక్టర్ విభూతి సత్యదేవ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గీతం ఎన్ఎస్ఎస్.ప్రోగ్రామ్ ఆఫీసర్ మర్రి జ్యోతి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, సమాజ సంక్షేమం, టెక్నాలజీపై వివరించారు. వివిధ పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. డిజిటల్ టెక్నాలజి గురించి వివరించారు. పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ःగుడ్‌టచ్-బ్యాడ్ టచ్ః అంశాలపై అవగాహన నిర్వహించారు. అంధు విద్యార్థులకు బ్రెయిలీ అక్షరాల ప్యానెల్, చారిత్రక కట్టడాల స్పర్శ నమూనాలు, స్పర్శ మ్యాప్‌లు, చిహ్నాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వయంగా తయారు చేశారు. విద్యార్థుల జ్ఞానేంద్రియ శిక్షణను మెరుగుపరచడానికి కూరగాయల తోట, సెన్సరీ గార్డెన్‌చ చెప్పులు లేకుండా నడిచే సెన్సరీపాత్‌వే ఏర్పాటు చేశారు. గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ అభినందించారు కార్యక్రమంలో ఐజిబిసి కోఆర్డినేటర్ దివ్యహరిణి పాల్గొన్నారు.

## రైల్వేజోన్ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలి: అజశర్మ డిమాండ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భవన నిర్మాణాలతో నిమిత్తం లేకుండా విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ డిమాండ్ చేశారు. అజశర్మ నేతృత్వంలో వేదిక బృందం విశాఖపట్నం, ముడసర్లోవ ప్రాంతంలో నిర్మిస్తున్న రైల్వే జోన్ భవన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈనెల1 నుంచి 5 వరకే ప్రధాన సమస్యల అధ్యయనానికి చేపట్టిన పర్యటనలో భాగంగా 52 ఎకరాలలో నిర్మిస్తున్న రైల్వే జోన్ భవన సముదాయం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు ఏదశలో ఉన్నాయి, ఎప్పటిలోగా పూర్తవుతాయనే అంశాలపై ఇంజనీరింగు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, 2014లో రాష్ట్ర విభజన చట్టంలో విశాఖ రైల్వేజోన్ ఏర్పాటును ప్రకటించగా, పలు ఆందోళనల తర్వాత పదేళ్లకు పనులు మొదలెట్టారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తయ్యేందుకు మరో రెండేళ్లయినా పడుతుందన్నారు. అంతవరకు ఆగకుండా రైల్వేజోన్ కార్యకలాపాలను ప్రారంభించాలన్నారు. విశాఖలో రైల్వేకుపెద్ద ఎత్తున భూములు, 700 ఎకరాలు ఖాళీ స్థలాలు, ఖాళీగా డిఆర్ఎం కార్యాలయం కూడా ఉందన్నారు. వాటిల్లో తాత్కాలికంగా జోన్ కార్యకలాపాలను ప్రారంభించి, శాశ్వత భవన నిర్మాణాలు పూర్తయితే అందులోకి మారే అవకాశం ఉన్నందున ఆ దిశగాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సందర్శనలో కె.సత్యనారాయణ, కె.వెంకటరావు, ఎన్.నాగేశ్వర్రావు, పిట్లా నారాయణమూర్తి, వి.నరేంద్రకుమార్, పి.శంకర్, ఐ,సి.నాయుడు, నాగరాజు పాల్గొన్నారు. గూగుల్ డేటా సెంటర్ పేరుతో దళితుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం సరికాదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజ శర్మ అన్నారు. గురువారం తర్లువాడ గ్రామాన్నిసందర్శించి గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను వేదిక బృందం పరిశీలించింది. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అజ శర్మ మాట్లాడుతూ, దళితులకు ఇచ్చిన డిపట్టా భూముల్లో జీడి, మామిడి తోటలు వేసుకుని జీవనోపాధి పొందుతున్న నేపథ్యంలో వాటిని గూగుల్ డేటా సెంటర్‌కు తీసుకోవడం సరికాదన్నారు. 250 మంది దళితులు సాగులో ఉన్నప్పటికీ 49 మందికి మాత్రమే పట్టాలు ఉన్నాయని, అయినప్పటికీ సాగుదారులైన దళితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ చెల్లించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటైతే పరిసర గ్రామాలను కూడా తరలించే పరిస్థితి రావచ్చన్నారు.

## విశాఖ నీటి అవసరాలకు సమగ్ర ప్రణాళిక



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో పెరుగుతున్న జనాభా, పరిశ్రమల అభివృద్ధి దృష్ట్యా భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో నగరానికి సంబంధించిన నీటి డిమాండ్, సరఫరా పరిస్థితులు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, సిఇ సత్యనారాయణరాజు, ఎస్ఇ రవికుమార్, ఇరిగేషన్, విస్కో, ఇతర అధికారులు భాగస్వామ్యమై పలు అంశాలపై చర్చించారు. జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రస్తుత తాగునీటి నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2024 నాటికి విశాఖ నగర జనాభా సుమారు 24 లక్షలుగా ఉండగా రోజుకు సుమారు 453 ఎంఎల్‌డి నీటి అవసరం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం సుమారు 390 ఎంఎల్‌డి నీటి సరఫరా జరుగుతుండగా దాదాపు 63 ఎంఎల్‌డి లోటు ఉన్నట్లు పేర్కొన్నారు. 2040 నాటికి 726 ఎంఎల్‌డికి, 2055 నాటికి సుమారు 836 ఎంఎల్‌డి నీరు అవసరం ఉంటుందని అంచనా వేశారు. ప్రస్తుత సరఫరా సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే భవిష్యత్‌లో నీటి లోటు గణనీయంగా పెరిగే అవకాశముందని, దానికి తగ్గట్లుగా బృహత్ కార్యాచరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమీక్షలో భాగంగా విశాఖలో అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలను కూడా చర్చించారు. అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్, హెచ్‌పిసిఎల్, ఎపిఐఐసి పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్లు, ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు తదితర పరిశ్రమలకు భవిష్యత్‌లో గణనీయమైన స్థాయిలో నీటి అవసరం ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. 2026 నుంచి 2031 మధ్య కాలంలో పరిశ్రమల అవసరాల కోసం, వ్యవసాయ, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో నీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ వనరులను గుర్తించడం, రీసైకిల్ నీటి వినియోగాన్ని పెంచడం, కొత్త ప్రాజెక్టులపై దృష్టి పెట్టడం అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. జివిఎంసి పరిధిలో ఉన్న నీటి నిల్వ ట్యాంకుల మరమ్మతులు పూర్తి చేసి వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. నీటి పునర్వినియోగం (రీసైక్లింగ్)పై ప్రత్యేక దష్టి పెట్టాలని, నగరంలో నీటి నిర్వహణను మెరుగుపరచేందుకు అవసరమైన క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు మెఘాద్రి రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి నిర్వహణలో అంతర్జాతీయ స్థాయి అనుభవాలను అధ్యయనం చేయడానికి సింగపూర్ నిపుణులు విశాఖపట్నం నగరాన్ని సందర్శించనున్న క్రమంలో ప్రాథమిక సమీక్ష నిర్వహించిన కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 10వ తేదీన సింగపూర్ వాటర్ సెంటర్ బృందంతో జరిగే కాన్ఫరెన్స్‌లో ప్రస్తుత నీటి నిర్వహణ పద్ధతులు, భవిష్యత్తు కార్యాచరణ, ఆర్థిక ప్రణాళికలు, భాగస్వామ్య సంస్థల సహకారం గురించి వివరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## రుషికొండ తీరంలో వించ్ పారాసెయిలింగ్ ట్రయల్ రన్ విజయవంతం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలోని రుషికొండ వద్ద వించ్ పారా సెయిలింగ్ ట్రయల్‌రన్ విజయవంతంగా నిర్వహించారు. ఇది సాధారణ పారా సెయిలింగ్‌కు భిన్నంగా ఉంటుంది. పర్యాటకులు బోటు పైనుంచి పారాచూట్ సాయంతో పైకి వెళ్లి, తిరిగి వస్తారు. పర్యాటక శాఖ అధికారులు, నిపుణుల సమక్షంలో ఈ ట్రయిల్ రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గాలివేగం, సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విశాఖకు వచ్చే పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి సాహస క్రీడలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.

## నిర్బంధాలతో ఉద్యమాలు ఆగవు



**మధురవాడ, పతాకం న్యూస్:** నిర్బంధాలతో ఉద్యమాలను అణిచివేయాలనుకోవడం అవివేకమని సిఐటియు మధురవాడ జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా దీక్షలు చేస్తున్న అంగన్వాడీలను నిర్బంధించి, దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ, పోలీసు చర్యలను నిరసిస్తూ, అంగన్వాడీలకు సంఘీభావంగా లక్ష్మివానిపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, కార్మిక, ప్రజాపోరాటాలను అణచివేసేందుకు నిర్బంధాలను ప్రయోగించిన గత ప్రభుత్వాలకు ఏ గతి పట్టిందో ప్రస్తుత కూటమి ప్రభుత్వం గమనించాలన్నారు. అంగన్వాడీల 42రోజుల సమ్మె సమయంలో విపక్షంలో ఉన్న టిడిపి, వారికిచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా అమలు చేయకపోవడం దుర్మార్గమని, దీనిపై ప్రశ్నిస్తే మగపోలీసులతో మహిళలపై దౌర్జన్యం చేయడం అన్యాయమన్నారు. అంగన్వాడీలకు న్యాయం జరిగే వరకు వారి పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు మున్సిపల్ నాయకులు ఎస్ రామప్పడు, సిహెచ్ శేషుబాబు, జి.కిరణ్, డి.సూరిబాబు, కె.నాగరాజు, కె.అర్జునమ్మ, బి.అప్పారావు, బి ఆదిలక్ష్మి, లక్ష్మి రెడ్డి, దేవుడు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ అమలుపై అభ్యంతరాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కొత్తగా అమలులోకి రానున్న లేబర్ కోడ్స్ అమలుపై అధిక శాతం మంది యజమానులు, కార్మిక సంఘాల ప్రతినిధులు అభ్యంతరం తెలిపారు. షెడ్యూల్డ్ ఎంప్లారుమెంట్స్‌కు సంబంధించిన ప్రస్తుత కనీస వేతనాల సవరణ -2 మండలి చైర్మన్ పి.శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో యజమాన్యాలు, ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో సాయంత్రం టర్నర్ చౌల్ట్రీ సమీపంలోని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ హాలులో సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశం ప్రధానంగా వివిధ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ అమలులో ఉన్న కనీస వేతనాలను సవరించడానికి సంబంధించి యజమాన్యాలు, ఉద్యోగుల సంఘాల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్స్, ముఖ్యంగా జీతభత్యాలకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న కొంతమంది యజమాన్యాల ప్రతినిధులు కొత్త లేబర్ కోడ్స్‌ను స్వాగతించినప్పటికీ, అనేక మంది యజమాన్యాలు, సంఘాల ప్రతినిధులు వ్యతిరేకించారు. పరిశ్రమలు, వ్యాపార సంస్థలను నిర్వహించడంలో ఎదుర్కొంటున్న ఆర్థిక పరిమితులు, వ్యయభారం పెరగడం వంటి కారణాల వల్ల లేబర్ కోడ్స్, వేతనాలు అమలుపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రస్తుత జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల జీవనానికి సరిపడా కనీస వేతనాలను సవరించాలని కోరారు. చిన్న స్థాయి పరిశ్రమలలో పని చేసే కార్మికులకు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణం సంభవించిన సందర్భాల్లో చెల్లించాల్సిన పరిహారం మొత్తాలను పెద్ద పరిశ్రమలతో పోలిస్తే భరించలేని పరిస్థితి ఉందని యజమాన్యాల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కార్మిక సంఘాల ప్రతినిధులు స్పందిస్తూ పరిశ్రమలలో పరిశ్రమలలో ఉన్న లోపాలను గుర్తించి సరిచేసే చర్యలు తీసుకుంటే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. కనీస వేతనాల సలహా మండల చైర్మన్ పి.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, సమావేశంలో తెలియజేసిన సూచనలు, అభ్యర్థనలను పరిశీలించి, సలహా మండలి సభ్యులతో చర్చించిన తర్వాత, కనీస వేతనాల సవరణపై తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.రామారావు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో చాంబార్ ఆఫ్ కామర్స్, డాల్ మిల్స్ అసోసియేషన్, గోల్డ్ అసోసియేషన్, జెఎన్‌పిసి మర్చంట్స్ అసోసియేషన్, ఫార్మా అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్ టియుసి, టిఎన్‌టియుసి, బిఎంఎస్ తదితర యూనియన్ల ప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలు వ్యక్తపరిచారు.కనీస వేతనాలు నిర్ణయించాలి : సిఐటియు కనీస వేతన చట్టం ప్రకారం, ప్రస్తుతం ధరలకు అనుగుణంగా, షెడ్యూల్ ఎంప్లాయిమెంట్, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించి, వెంటనే జిఒలు విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా, సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం వేతనాలు నిర్ణయించాలని, వాటిని అమలు చేయడానికి పటిష్టంగా కార్మిక శాఖ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, గనిశెట్టి సత్యనారాయణ, ఎం.శ్రీను పాల్గొన్నారు.

## 7 నుంచి జనగణన-2027పై అధికారులకు శిక్షణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జనగణన-2027కు సన్నాహాలు ప్రారంభించినట్టు జిల్లా ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలిదశలో ఇళ్ల వివరాలు, కుటుంబ సభ్యుల వివరాల నమోదుకు అధికారులకు ఈనెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

# చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం: రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, పతాకం న్యూస్:** చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు.

## ప్రతిపక్షం తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది: మంత్రి పయ్యావుల



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రసంగించారు. సభ్యులంతా బడ్జెట్ డిమాండ్లపై ఉత్సాహంగా చర్చలో పాల్గొన్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా వివిధ శాఖల డిమాండ్లపై మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా చర్చలో మాట్లాడినట్లు రికార్డుల్లో లేదని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబును చూసి నేర్చుకోవచ్చని మంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షం లేకపోవడం బాధాకరంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంలో ఉన్నవారు ఎవరైనా ద్రవ్య వినిమయ బిల్లు చర్చలో పాల్గొనడానికి ఎదురుచూసేవారని చెప్పారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడే అవకాశం కోసం గట్టిగా ప్రయత్నించేవాళ్లమని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించిందని మంత్రి విమర్శించారు. బడ్జెట్ భాషను సరళీకృతం చేశామని, ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయికి సభ అనుమతి తీసుకుంటున్నట్లు తెలిపారు. 2023-24లో మూలధన వ్యయం రూ.24 వేల కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.53,915 కోట్లకు పెంచామని వివరించారు. మూలధన వ్యయం పెరగడం వల్ల మౌలిక వసతులు మెరుగుపడి వేగంగా అభివృద్ధి జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి చెప్పే సంపద సృష్టి జరగాలంటే మూలధన వ్యయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు మంత్రి. సాగునీటి ప్రాజెక్టులు, పోర్టులు, రోడ్ల నిర్మాణం ద్వారా ఆర్థిక కార్యకలాపాలు జరిగి సంపద వృద్ధి చెందుతుందని వివరించారు. పాలన అంటే బటన్లు నొక్కడం కాదని.. ప్రజలకు తమ కాళ్ల మీద నిలబడే శక్తిని అందించడమని మంత్రి చెప్పారు. చేపలు పెట్టడం కాదు.. పట్టాలన్న కార్ల్ మార్క్స్ చెప్పిన మాటల్ని చంద్రబాబు పదేపదే చెబుతారని.. ఈ ప్రభుత్వం అదే విధంగా పనిచేస్తోందని తెలిపారు. సంక్షేమాన్ని విస్మరించలేదని.. సంక్షేమాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలు బాగా ఉపయోగించుకుంటున్నారని.. పథకాల ద్వారా మహిళల సంతోష స్థాయిని పెంచామని తెలిపారు. తాము ఇచ్చిన పథకాలన్నీ కుటుంబ బడ్జెట్‌కు చేదోడుగా నిలుస్తున్నాయని మంత్రి వివరించారు. ప్రాంతీయ అసమానతలకు తావు లేకుండా బడ్జెట్ రూపొందించామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. రాయలసీమ ప్రాజెక్టులు ఆపామని వైసీపీ చెప్పడం అబద్ధమని మంత్రి ఖండించారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్జీటీ ఆదేశాలతో రాయలసీమ ఎత్తిపోతలు ఆపేశారని, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే కనీసం దానివైపు చూడని వ్యక్తి జగన్ అని విమర్శించారు. అధికారం కోసం ప్రతిసారీ పెత్తందార్లు రాయలసీమ పేరుతో మాట్లాడతారని మండిపడ్డారు. ఎన్టీఆర్ మాత్రమే రాయలసీమ గురించి చిత్తశుద్ధితో పనిచేస్తే.. చంద్రబాబు దాన్ని కొనసాగించారని తెలిపారు. మంచి చేసినప్పుడు చెప్పడంతో పాటు.. అవతలి వారి తప్పులు కూడా చెప్పాలన్నారు. రాజకీయ నిరుద్యోగులంతా ఒక చోట చేరి.. రాయలసీమ గురించి ప్రేమ ఒలకబోస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్




**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హైకోర్ర ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రానున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి జస్టిస్ లీసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టులో తొలుత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రికార్డు సృష్టించనున్నారు.

## భూసమస్యల పరిష్కారానికే 'రెవెన్యూ క్లినిక్'



**కొమరాడ, పతాకం న్యూస్:** గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి విలేజ్ రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విక్రంపురం సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మారు మూల గ్రామాల ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండరాదనే ఉద్దేశంతో సచివాలయ స్థాయిలోనే ఉన్నతాధికారులు అందుబాటులో ఉండటం వల్ల పనుల్లో జాప్యం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యుడు దేవకోటి వెంకటనాయుడు, గ్రామపెద్దలు కె.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు



**హిరమండలం, పతాకం న్యూస్:** మేజరు పంచాయతీ హిరమండలంలోని సుభలయి మెట్టపై వెలసి ఉన్న వేంకటేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు వంశధారనదిలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన డోలోత్సవాలు వైభవంగా సాగాయి. ఆఖరి ఘట్టమైన చక్రతీర్థ స్నానాలకు కొత్తూరు, పాతపట్నం, ఎల్ఎన్ పేట, హిరమండలం మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో వంశధార నదీ తీరం జనసంద్రంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో చక్రస్నానం చేయించారు. అక్కడకు వచ్చే భక్తులకు సుభలయి గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కొత్తూరు సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో హిరమండలం, కొత్తూరు ఎస్ఐలు వి.హేమంత్, వెంకటేష్ బందోబస్తు నిర్వహించారు.

## కాలినడకన తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కవిత



**తిరుపతి, పతాకం న్యూస్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తిరుమల శ్రీవారిని దర్శించున్నారు. వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో కుటుంబ సభ్యులతో స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు కవితకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన కల్వకుంట్ల కవిత స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి దర్శనం చేసుకున్న అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పడుతున్న మనోవేదన స్వామివారి దయతో తీరిందని అన్నారు. నేను ముందు నుంచీ సత్యం, న్యాయం, ధర్మం నావైపు ఉందని చెప్పిన మాట ఇప్పుడు అక్షరాలా నిజమైందని ఆమె గుర్తు చేశారు. అంతేకాకుండా కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానట్లు కవిత తెలియజేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజల పక్షాన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు. ఆ పార్టీకి స్వామివారి ఉండాలని ప్రార్థించానని వివరించారు. అంతేకాకుండా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా కల్వకుంట్ల కవిత తిరుమలకు చేరుకున్నారు. తిరుపతి అలిపిరి మెట్ల మార్గం నుంచి భారీగా జాగృతి శ్రేణులు కుటుంబ సభ్యులతో కలిసి కవిత తిరుమలకు చేరుకుని మెట్లకు మొక్కులు చెల్లించారు. ఈరోజు ఉదయం శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. గత నాలుగు సంవత్సరాలుగా కక్షపూరితంగా కేంద్రప్రభుత్వం పెట్టిన కేసుల నుంచి కోర్టు మంచి తీర్పు ఇచ్చిందని కవిత సంతోషం వ్యక్తం చేశారు. కేసులను పెట్టేందుకు, ఛార్జిషీట్ వేసేందుకు ఇందులో ఏమీలేదని కోర్టు తెలిపిందని ఆమె తేల్చి చెప్పారు.

## అటవీ ఉత్పత్తులకు అడ్వాన్స్ టెండర్లు



**సీతంపేట, పతాకం న్యూస్:** :స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అటవీ ఉత్పత్తులకు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ అడ్వాన్స్ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. గిరిజన ఉత్పత్తులను జీసీసీ ప్రకటించిన మద్దతు ధర ప్రాప్తికి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పీవో సూచించారు. ఒక్కో వ్యాపారస్థుడికి ఇచ్చిన టార్గెట్‌ల ప్రకారం కొండచీపుర్లను కొనుగోలు చేయాలన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ ఐటీడీఏ, జీసీసీ ఆదేశాల మేరకు అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటే అటవీశాఖ సిబ్బంది అడ్డుకుంటున్నారని పీవో దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై పీవో మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారులతో మాట్లాడతాన న్నారు.అడ్వాన్స్ టెండర్‌ల ప్రక్రియలో జీసీసీ డీఎం కృష్ణారావు, బీఎం నర్సింహులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** కోమర్తి సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.గోపాలరావుపై అదే గ్రామానికి చెందిన కింజరాపు ప్రసాదరావు దాడి చేయడం తగదని, వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట వీఆర్వోలు, సర్వేర్లు, రెవెన్యూ సిబ్బంది ఆందోళన చేపట్టారు. ప్రసాదరావుపై కేసు నమోదు చేసి వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, రెవెన్యూ సంఘాల నాయకులు అప్పలనాయుడు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



**పోలాకి, పతాకం న్యూస్:** ప్రియాగ్రహారంలో వేంచేసి ఉన్న లలిత త్రిపురాంతకవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్ల దేవస్థానంలో మూడురోజుల పాటు నిర్వహించిన డోలోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 33 జట్లు పాల్గొన్నాయి. తెలుగుయువత పార్లమెంటరీ యువ నాయకులు మెండ దాసునాయుడు, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, జనసేన నాయకుడు ప్రదీప్‌కుమార్, మెట్ట వైకుంఠరావు, పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఉత్సవాల్లో పాల్గొన్నారు. సర్పంచ్ బెవరనూకరాజు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, ఎంపీటీసీ ప్రసాదరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ పురోహితులు శ్రీనాథ్‌శర్మ ఆధ్వర్యంలో పుష్పాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు.

## హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు ఆటంకం కలిగించం: ఇరాన్



**ఇరాన్:** హోర్ముజ్ జలసంధిలో భారతీయ చమురు నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే ఒక అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ, భారత నౌకలను తాము అడ్డుకుంటున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. అదే సమయంలో హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకలపై జరుగుతున్న దాడుల విషయంలో భారత్ చొరవ తీసుకోవాలని, ఈ దాడులకు కారణమైన అమెరికాను ప్రశ్నించాలని ఆయన సూచించారు. హోర్ముజ్ జలసంధిలో స్థిరత్వం కోసం ఇరాన్ నిరంతరం ప్రయత్నిస్తుందని, ఒకవేళ ఆ జలసంధిని మూసివేయాల్సి వస్తే తామే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి అలాంటి ఉద్దేశం లేదని, తమది బాధ్యతాయుతమైన దేశమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జలాల్లో అమెరికా తీరు ప్రమాదకరంగా ఉందని, ఆ దేశపు "ఫుట్‌బాల్ మెంటాలిటీ" (దూకుడు స్వభావం) వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. భారత్, ఇరాన్ దేశాలు "చదరంగం" ఆడే మనస్తత్వం కలవని, అంటే దౌత్యపరమైన ఆలోచనలతో, వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించుకుంటాయని ఆయన అభివర్ణించారు. ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి దౌత్యమే సరైన మార్గమని, వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

## ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ సిద్ధం




**భీమవరం, పతాకం న్యూస్:** రబి సీజన్ ధాన్యం కొనుగోలుకు అధికారులు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా శాఖలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెల 20వ తేదీ తర్వాత రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం మండలాల్లో ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. తేమ శాతం కొలిచే యంత్రాలను క్యాలిబ్రేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.సరోజ, మేనేజర్ ఎమ్‌డి ఇబ్రహీం పాల్గొన్నారు. జిల్లాలోని ఆక్వా రైతుల సమస్యలపై జెసి కలెక్టరేట్‌లో మత్స్యశాఖ, తూనికలు-కొలతలు, కమర్షియల్ టాక్స్, ఎంపెడ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఆక్వా రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాలని, అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జనగణన 2027ను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జెసి సూచించారు. మొదటి దశ 'గృహాల జాబితా, గృహ వసతుల గణన' శిక్షణా కార్యక్రమం మూడవ రోజు ఆయన పాల్గొని శిక్షణ తీరును పరిశీలించారు. అధికారులు వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ బి.రమాదేవి పాల్గొన్నారు.

## కొత్త వాహనాల కొనుగోళ్లపై 10 శాతం లైఫ్‌టాక్స్ పెంపు



**భీమవరం, పతాకం న్యూస్:** నూతన మోటారు వాహన కొనుగోలు దారులపై రాష్ట్ర ప్రభుత్వం అదనపు పన్ను విధించింది. మోటర్‌సైకిల్, మోటారు కారు, క్యాబ్, నాలుగు చక్రాల సరుకు రవాణా, నిర్మాణరంగ, ఇతర వాహనాలకు 10 శాతం లైఫ్ టాక్స్ పెంచింది. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ మోటర్ వాహన పన్ను విధింపు సవరణ చట్టం బిల్లు 2026ను శాసన సభ ఆమోదించింది. నెలకు సగటున 73 వేలు చొప్పున ఏడాదికి 8 లక్షల 76 వేల వాహనాలు విక్రయాలు జరుగుతాయని, నెలకు రూ.22.5 కోట్లు చొప్పున ఏడాదికి రూ.270 కోట్లు అదనపు ఆదాయం ప్రభు త్వానికి సమకూరుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం రహదారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తోందని, దీనిలో భాగంగానే అదనపు పన్ను విధించినట్లు చెప్పారు. నూతన వాహనాల కొనుగోలుపై జిఎస్‌టిని కేంద్రం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం జరిగిందని, తాజా బిల్లులో రాష్ట్ర ప్రభుత్వం ఈ మొత్తాన్ని సెస్ రూపంలో వసూలు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

## సమస్యలను పరిష్కరించకపోతే ఏప్రిల్ 20 నుండి నిరవధిక సమ్మె



**మంగళగిరి, పతాకం న్యూస్:** వీఆర్ఏ ల సమస్యలను పరిష్కారం చేయకపోతే వచ్చే నెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళతారని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు ప్రకటించారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ .... శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి ఆటోనగర్ లో ఉన్న సీసీఎల్ఏ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి సంగం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్ అధ్యక్ష వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ .... తెలంగాణ ప్రభుత్వము లాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నప్పటికీ వేతనాలు సరిపడా లేవని విమర్శించారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలకు, ఎంపీలకు లక్షల రూపాయలు వేతనాలు ఇస్తున్నారని విమర్శించారు. అనేక రకాల పదవులు చేసినప్పటికీ అన్ని రకాల పదవులకు పెన్షన్లు కూడా ఇస్తున్నారని విమర్శించారు. కష్టపడి పనిచేసే గ్రామ సేవకుల వేతనాలు మాత్రం పెంచడం లేదని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చాక జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలకు నోచుకోలేదని విమర్శించారు. ప్రమోషన్లు అమలు చేయడం లేదని అన్నారు. 22 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం వీఆర్ఏల సమస్య ఏ ఒక్కటి పరిష్కారం చేయలేదని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు వేస్తున్నారని అన్నారు. రీ సర్వే పేరుతో మైళ్ళకొద్దీ ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయాల్సి వస్తుందని అన్నారు. దీనివలన పని భారం పెరగడం, టి ఏ, డిఏల గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. అదనపు పని భారానికి ఆర్థిక సమస్యలు తోడవడంతో వీఆర్ఏల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన స్థితికి నెట్టబడ్డాయని విమర్శించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కారం చేయకపోతే వచ్చే ఏప్రిల్ 20వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సేవకులు నిరవధిక సమ్మెలోకి వెళతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ లోపు సమస్యల పరిష్కారం చేయడానికి ప్రభుత్వం పూనుకోవాలని కోరారు.

# నిబంధనలకు పాతరేస్తున్న.. పలు మెడికల్ షాపుల యజమానులు?



**కాకినాడ, పతాకం న్యూస్:** పలు మెడికల్ షాపుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కొనుగోలుదారుల నుంచి వినిపిస్తున్నాయి. అధిక ధరలకు విక్రయాలు జరుగుతుండడంతో పాటు డాక్టర్ రాసిన చీటీ లేకుండానే కొన్ని మందులను అమ్మకాలు జరుపుతున్నారు. అనేక షాపుల్లో బిల్లులు కూడా ఇవ్వకుండానే రోగులను దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోగం వస్తే ఒకటి రెండు రకాలకు బదులుగా అరడజను రకాల మందులను వాడిస్తుండడం వల్ల రోగుల జేబులు ఖాళీ అవుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో నామమాత్రపు తనిఖీలతో సరి పెడుతున్నారన్న ఆరోపణలు అధికారులపై పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు రెండు వేల రిటైల్ మెడికల్ షాపులు, సుమారు 900 వరకూ హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి.

కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం తదితర ప్రాంతాల్లో పలు కంపెనీలు కొన్ని రకాల మందులు గల షీట్స్‌పై అధిక రేట్లు వేయడమే కాక నాసిరకం మందులు విక్రయిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు నీళ్ళోదులుతూ యథేచ్ఛగా అధిక ధరలకు మందుల విక్రయాలు జరుపుతున్నారు. ఆయా కంపెనీలు వివిధ రకాల పేర్లతో నాసిరకం మందులు మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. బిల్లులు లేకుండానే దాదాపు చాలా దుకాణాలు అమ్మకాలు సాగిస్తున్నాయి. నకిలీ మందులతో మరికొన్ని దుకాణదారులు బురిడీ కొట్టిస్తున్నారు.జేబులు గుల్ల చేస్తున్న వైనంమందుల తయారీ సంస్థలు నేరుగా వైద్యులతో ఒప్పందాలు కుదుర్చుకుని మందులను సరఫరా చేస్తున్నాయి. వీటికి ఎలాంటి బిల్లులను రోగులకు ఇవ్వడం లేదు. ఉదాహరణకు కొన్ని కంపెనీలు సుమారు రూ.లక్ష విలువచేసే మందులను వైద్యులు రాస్తుంటే వారికి రూ.15 నుంచి 20 వేల వరకు కమీషన్ ఇస్తున్నట్లు సమాచారం. వైద్యులకు విదేశీ పర్యటనలు, దేశంలోని పర్యాటక ప్రదేశాలకు ఖర్చులను ఆయా ఫార్మసీ కంపెనీలే భరించేందుకు వైద్యులను ప్రలోభాలకు గురి చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాధారణ రోగులకు అధిక మొత్తంలో మందులు విక్రయించి వారి జేబులు గుల్ల చేస్తున్నారన్న విమర్శలు మెడికల్ షాపులపై వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ధరలను కాకుండా అనేక రకాల మందులు, ఇంజక్షన్లపై సొంతంగా ధరలను ముద్రించి రెండు, మూడు రెట్లకు ఎక్కువగా విక్రయిస్తున్నారని అధికారులకు తరచూ ఫిర్యాదులు వెళుతున్నాయి. అధిక ధరకు విక్రయిస్తున్నందుకు డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్న్ 2013 చట్టం ఉల్లంఘన కింద డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మందులను స్వాధీనం చేసుకుంటున్నా కొంతకాలానికి మెడికల్ షాపులు మళ్లీ దందా మొదలు పెడుతున్నాయి. అదే పనిగా నిబంధనలకు పాతరమందులు షాపును నిర్వహించాలంటే బి.ఫార్మసీ, డి.ఫార్మసీ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండడంతో పాటు ఉత్తీర్ణులైన వారు కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంది. ఉత్తీర్ణులైన వారు మాత్రమే మందులను విక్రయించాలి. జిల్లాలో అనేక మెడికల్ షాపులు అందుకు విరుద్ధంగా నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరి పేరుతో అనుమతులు తీసుకుని మరొకరు కనీస అవగాహన లేనివారు సైతం షాపులను నిర్వహిస్తున్నారు. ఆయా దుకాణాల్లో సంబంధిత వ్యక్తి ధ్రువీకరణ పత్రం మాత్రమే కనిపిస్తుంది. కానీ ఉత్తీర్ణులైన వారు ఎక్కడా కనిపించకపోవడం శోచనీయం.

అరకొర చదువులు మాత్రమే చదివిన వారు షాపుల్లో మందులను విక్రయిస్తుండటం వల్ల డాక్టర్లు రాసిన చీటీలో మందుల వివరాలు సరిగా అర్థం కాక ఒకటికి బదులు మరో మందులు ఇస్తున్న సందర్భాలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తమకు తామే రోగాలను కొని తెచ్చుకుంటున్నామని రోగులు వాపోతున్నారు. పలు దుకాణాల్లో సక్రమంగా స్టాక్ రిజిస్టర్లు ఉండడం లేదు. ఎక్కడ కొంటున్నారు, ఏయే మందులు కొనుగోలు చేస్తున్నారు. ఎంత విక్రయిస్తున్నారు. అనే లెక్కలు కనీసం కనిపించడం లేదు. అప్పుడప్పుడు అధికారులు తనిఖీలు చేసి, కేసులు నమోదు చేస్తున్నా మార్పు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో నకిలీ మందుల ముఠాలు చెలరేగిపోతున్నాయి. కాలం చెల్లిన మందులను విడివిడిగా కొనుగోలుదారులకు అంటగడుతున్నారు. షీట్స్‌పై ముద్రిం చిన తేదీని తమ వద్ద ఉంచుకుని రెండో వైపు వాటిని ఇస్తున్నారు.నామమాత్రపు చర్యలేనా...? వస్తున్న ఫిర్యాదులపై సంబంధిత మందుల దుకాణాలు, కంపెనీలను తనిఖీ చేస్తున్నా నామాత్రపు చర్యలతో సరిపెడుతున్నారనే విమర్శలు అధికారులపై జనం నుంచి వస్తున్నాయి. బిల్లులు ఇవ్వకుండా మందులు ఇస్తున్నారని ఫిర్యాదుల పైనా, కాలం చెల్లిన మందులు, అధిక ధరలకు విక్రయం ఫిర్యాదులు ఎక్కువగా అధికారులకు అందుతున్న పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేక అరకొర చర్యలతో మాత్రమే సరిపెడుతున్నారన్న విమర్శలు రోగులనుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# ఇక పల్లెల్లో 'ప్రత్యేక' పాలన!..

## ఏప్రిల్ 2తో ముగుస్తున్న సర్పంచ్‌ల పదవీకాలం

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పల్లెల్లో త్వరలో ప్రత్యేకాధికారుల పాలన రానుంది. సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది. నిబంధనల ప్రకారం ఆలోపే ఎన్నికలు నిర్వహించాలి. కానీ బీసీ రిజర్వేషన్ల ఖరారు, డెడికేటెడ్ కమిషనర్ నివేదిక తదితర సాంకేతిక, న్యాయపరమైన అంశాల నేపథ్యంలో.. జూన్ తర్వాతే స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు జరిగే వరకూ గ్రామ పంచాయతీల పాలనను ప్రత్యేకాధికారులకు అప్పగించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాలోని 30 మండలాల పరిధిలో మొత్తం 912 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో ఎంపీడీవో, ఈవోపీఆర్డీలు, తహసీల్దార్లు, ఇతర మండలస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. ఒక్కో అధికారికి రెండు, మూడు లేదా ఆపైగా పంచాయతీల బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ముందు ప్రధానంగా బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి రావాల్సి ఉంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు(ట్రిపుల్ టెస్ట్) ప్రకారం రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 45 రోజుల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాత బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ప్రారంభించడానికి కనీసం మరో రెండు నెలలు పడుతుంది. వీటికితోడు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) నీలం సాహ్ని పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. కొత్త ఎస్ఈసీగా రిటైర్డ్ సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్‌ను నియమించే ఆలోచనలో




ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ పూర్తయ్యే సరికి జూన్ దాటే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణపై కూటమి పార్టీల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ముందుగా పార్టీ గుర్తులు లేకుండా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే.. గ్రామాల్లో సహజంగానే వర్గాలు ఏర్పడతాయి. ఈ వర్గపోరు ప్రభావం.. ఆ తర్వాత జరిగే మండల, జిల్లా పరిషత్ (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికలపై పడే ప్రమాదం ఉందని జిల్లా నేతలు భావిస్తున్నారు. అలాకాకుండా, ముందుగా పార్టీ గుర్తుల మీద జరిగే పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తే.. కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేసి పూర్తిస్థాయిలో స్థానాలు కైవసం చేసుకునే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్థానికంగా ఉన్న మండలస్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు ముందుగా పరిషత్ ఎన్నికలకే మొగ్గు చూపుతున్నారు. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలకు వెళ్లడమే శ్రేయస్కరమని జిల్లా కూటమి ముఖ్యనేతలు సైతం భావిస్తున్నట్లు సమాచారం.

## కృత్రిమ మేధస్సుపై అవగాహన సదస్సు



**జగ్గంపేట, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధస్సు అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో నన్నయ్య విశ్వవిద్యాలయం వాణిజ్య, మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ ఎస్.ఉదయ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. డేటా ఆధారిత నిర్ణయాలు, ఆటోమేషన్, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా వ్యాపార విస్తరణ ఎలా సాధ్యమవుతుంది అనే అంశాలపై ఆయన వివరించారు. ఈ వెబినార్‌కు పోషకులుగా కళాశాల విద్యా కమిషనర్ కె.నారాయణ భరత్‌గుప్తా, జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ, రీజనల్ జాయింట్ డైరెక్టర్ పివి.కృష్ణాజీ వ్యవహరించారు. ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు, గురు ఘాశి దాస్ విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ బి. వేంకటేశ్వరరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం వాణిజ్య మేనేజ్‌మెంట్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. సుబ్బయ్య పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ జాతీయ స్థాయి వెబినార్‌లో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 6.28 లక్షల ఉద్యోగాలు ఎక్కడో చెప్పాలి: ఎమ్మెల్యే అరుణ్‌కుమార్

**అమరావతి, పతాకం న్యూస్:** ఎపిలో నిరుద్యోగ రేటు 8.2 శాతానికి పెరిగిందని, సిఎం 6.28 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారు. మంత్రులు మరొక లెక్క చెబుతున్నారని, ఉద్యోగాలు ఇక్కడ ఇచ్చారో చెప్పాలని' వైసిపి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని సిఎం చెప్పారని, మండలిలో మంత్రి రాంప్రసాదు 5.77 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారని, మంత్రి నారా లోకేష్ రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారని, ఎవరు చెప్పేది నిజమో వారే తెలపాలన్నారు. ఇచ్చిన ఉద్యోగుల పూర్తి వివరాలు పబ్లిక్ డొమైన్లో పెట్టాలని తెలిపారు. పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నారని, ఎక్కడ ఎన్ని ఒప్పందాలు జరిగాయి. ఎంత పెట్టుబడులు పెట్టారో బహిరంగ పర్చాలని అన్నారు. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కూడా తెలపాలన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ రేటు 4.1 శాతంగా ఉందని, 2023 డిసెంబర్లో రాజ్యసభలో విడుదలైన డేటా స్పష్టం చేసిందని, కానీ ఇప్పుడు నిరుద్యోగ రేటు పెరిగిందని, ఉద్యోగాలు ఇచ్చినప్పుడు ఈ రేటు ఎందుకు పెరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ఆధారంగానే డిఎస్‌సి, కానిస్టేబుల్ పోస్టుల నియామకం జరుగుతోందని అన్నారు. మద్యం దుకాణాల్లో 18 వేల మందిని, ఫైబర్‌నెట్‌లో 1800 మంది ఉద్యోగులను తొలగించారని పేర్కొన్నారు.

## రాక్ సిరామిక్స్‌లో జాయింట్ తనిఖీలు



**సామర్లకోట, పతాకం న్యూస్:** స్థానిక రాక్ సిరామిక్స్ పరిశ్రమలో పరిశ్రమల జాయింట్ తనిఖీలు జరిగాయి. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణపతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ గౌతమ్ బృందం సిరామిక్స్ పరిశ్రమను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిశ్రమ రికార్డులను డిసిఐఎఫ్‌తో కలిసి పరిశీలించారు. ..టిలో ఎలాంటి అభ్యంతరాలు లేనట్టు గుర్తించి సంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్లాంట్ హెడ్ శివాజీగణేష్ మీడియాకు తెలిపారు. పరిశ్రమ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రమాద రహిత పరిశ్రమగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ప్రమాదాలపై డెమో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో హెచ్ఆర్ హెడ్ హరికృష్ణమరాజు, అకౌంట్స్ హెడ్ నటరాజ్, ఇహెచ్ఎస్ మేనేజర్ బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

**అనంతపురం, పతాకం న్యూస్:** తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ .... అనంతపురం జిల్లా రాయదుర్గంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఔట్సోర్సింగ్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలపై పోరాటం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మొదటి రోజు సాగుతోంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి రాము, కోశాధికారి తిప్పేరుద్ర, నాయకులు తిప్పే స్వామి, మల్లేష్, వన్నూరమ్మ, ఆదిలక్ష్మి, లావణ్య, సహనాభి, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## పన్నుల వసూళ్లలో సీసీలు సహకారం అందించాలి



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** గణపవరం మండలంలో పంచాయతీల్లో కుళాయి, ఇంటిపన్నుల విషయంలో స్థానిక డ్వాక్రా సీసీలు, యానిమేటర్లు సహకారాన్ని అందించి పంచాయతీల అభివృద్ధికి తమ సహకారం అందించాలని గణపవరం ఎంపిడిఓ పి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలో ఉన్న సీసీలకు, యానిమేటర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇంటిపన్నులు, నీటికుళాయిలకు సంబంధించి పన్నులు వసూళ్లలో అధికారులకు సహకారం అందించి గ్రామాభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో ఉన్న డిజిటల్ పేమెంట్ చేయటం, స్థానికులకు పంచాయతీ పన్నులు కటించే విధంగా వారికి అవగాహన కలిగించారు. ఈ సమావేశానికి మండలంలో ఉన్న డ్వాక్రా సీసీలు, యానిమేటర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## పరిహారం చెల్లించి పనులు చేయండి

**గుత్తి, పతాకం న్యూస్:** తమ వ్యవసాయ పొలాల మీదుగా వెళ్తున్న విద్యుత్ హై టెన్షన్ తీగలకు సంబంధించి పరిహారం చెల్లించి పనులు చేపట్టాలని, తమకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని రెన్యూ సోలార్ ప్లాంట్ పనులను రైతులు అడ్డుకున్నారు. గుత్తి మండల పరిధిలోని ఊటకల్లు గ్రామంలో నూతనంగా రెన్యూ సోలార్ ప్లాంట్ కోసం విద్యుత్ టవర్లు, హై టెన్షన్ తీగలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే తమ వ్యవసాయ తోటలలో ఏర్పాటు చేస్తున్న టవర్లు, విద్యుత్ తీగలకు సంబంధించి పరిహారం చెల్లించిన తరువాతనే పనులు చేపట్టాలని ప్లాంట్ నిర్వాహకులను అడ్డుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రైతులు, సోలార్ ప్లాంట్ అధికారులతో మాట్లాడారు. సోలార్ ప్లాంట్ నిర్వాహకులు అక్రమంగా రైతులను మోసం చేస్తున్నారని కర్నూలు జిల్లా యల్లమ్మగుట్ట తండా గ్రామానికి చెందిన రైతు బాబు నాయక్ సోలార్ విద్యుత్ టవర్ పైకి ఎక్కి నిరసన తెలిపారు. రైతులకు న్యాయం చేసే వరకు టవర్ దిగేది లేదని పైనే ఉండిపోయారు. దీంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు సర్ది చెప్పి ఆయనను కిందకు దింపారు.



# రాత్రిపూట సరిగ్గా నిద్ర పట్టడం లేదా?

రాత్రిపూట సరిగ్గా నిద్ర పట్టడం లేదా.. వీటిని తింటే మేలు చేస్తాయి.. ప్రస్తుత కాలంలో సహజంగా నిద్రపోవడం చాలా కష్టతరంగా మారిందని చెప్పవచ్చు. ఒత్తిడి, ఫోన్ లను ఎక్కువగా ఉపయోగించడం, శరీరానికి తగినంత శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారని చెప్పవచ్చు. అయితే వీటితో పాటు మధ్యాహ్నం తీసుకునే ఆహారం కూడా రాత్రిపూట నిద్రపై ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యులు చెబు తున్నారు. ప్రస్తుత కాలంలో సహజంగా నిద్రపోవడం చాలా కష్టతరంగా మారిందని చెప్పవచ్చు. ఒత్తిడి, ఫోన్ లను ఎక్కువగా ఉపయోగించడం, శరీరానికి తగినంత శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారని చెప్పవచ్చు. అయితే వీటితో పాటు మధ్యాహ్నం తీసుకునే ఆహారం కూడా రాత్రిపూట నిద్రపై ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మధ్యాహ్నం సమయంలో కొన్ని ఆహారాలను సరైన పద్ధతిలో తీసుకోవడం వల్ల శరీరం సహజ నిద్రా విధానాలకు ఇవి మద్దతు ఇస్తాయని వైద్యులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల నిద్ర నాణ్యత కూడా పెరుగుతుందని వారు తెలియజేస్తున్నారు. రాత్రి నిద్రకు సహాయం చేసే కొన్ని రకాల సూపర్ ఫుడ్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



గాఢ నిద్ర కోసం తీసుకోదగిన వాటిల్లో బాదంపప్పు ఒకటి. దీనిలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది మెరుగైన నిద్రకు, విశ్రాంతికి తోడ్పడే ఖనిజం. సాయంత్రం 5 నుండి 7 గంటల సమయంలో నానబెట్టి తొక్క తీసిన బాదంపప్పును తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో మేల్కొనడం తగ్గడంతో పాటు నాణ్యమైన నిద్రను సొంతం చేసుకోవచ్చు. అరటిపండ్లు కూడా నిద్రపోవడానికి సహాయం చేస్తాయని చెప్పవచ్చు. అరటిపండ్లల్లో పొటాషియం, మెగ్నీషియం, ట్రిప్టోఫాన్ వంటి పోషకాలు కలిసి ఉంటాయి. అరటిపండును తీసుకోవడం వల్ల నిద్ర చక్రాలను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. భోజనం తరువాత లేదా రాత్రి భోజనం తరువాత అరటిపండును తీసుకోవడం వల్ల తగినంత విశ్రాంతిని పొందవచ్చు. ఇక నిద్రపోయే ముందు గోరు వెచ్చని పాలల్లో పసుపు కలిపి తీసుకోవడం వల్ల సహజంగా ప్రశాంతమైన నిద్రను సొంతం చేసుకోవచ్చు. ఇందులో చిటికెడు జాజికాయ పొడిని కలిపి తీసుకోవడం వల్ల తక్కువ నిద్ర ఉన్న వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

అదే విధంగా నిద్రకు ఉపయోగపడే మరో ఆహారం చెర్రీలు. ఇవి శరీరాన్ని చల్లబరిచే శక్తిని కలిగి ఉంటాయి. నిద్రకు భంగం కలిగించే అసమతుల్యతలను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. వీటిని తీసుకోవడం వల్ల మెలటోనిన్ ఉత్పత్తి పెరుగుతుంది. సాయంత్రం సమయంలో తాజా చెర్రీపండ్లను తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో సహజంగా నిద్ర వస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇటువంటి ఆహారాలను తీసుకుంటూనే జీవనశైలిలో మార్పులు కూడా చేసుకోవాలి. రాత్రిపూట స్క్రీన్ వాడకాన్ని తగ్గించడం, కెఫిన్ ను తక్కువగా తీసుకోవడం, రాత్రి సమయంలో ఆలస్యంగా భారీ భోజనాలు చేయడాన్ని తగ్గించడం, ఒత్తిడిని అదుపులో ఉంచుకోవడం వంటి వాటిని పాటించడం వల్ల సహజంగా నిద్రను సొంతం చేసుకోవచ్చు. అలాగే ఒకే సమయానికి నిద్రించడం, మేల్కొవడం వంటి వాటిని అలవాటు చేసుకోవాలి. ఇలా తగిన ఆహారాన్ని తీసుకుంటూ, చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల నిద్ర సమస్యల నుండి సహజంగా బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# నర్సీపట్నంలో ఐదేళ్ల క్రితం మూతపడిన కేంద్రం

## ఏటా ఖరీఫ్‌కు ముందు అనకాపల్లికి మట్టినమూనాలు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** పెదబొడ్డేపల్లిలోని నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐదేళ్ల క్రితం మూతపడిన భూసార పరీక్షా కేంద్రానికి ఇప్పటికీ మోక్షం కలగలేదు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌కు ముందు మట్టి నమూనా పరీక్షలు ఇక్కడ జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు ఏప్రిల్, మే నెలల్లో రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షా కేంద్రాలకు తీసుకెళుతుంటారు. ఇక్కడి సిబ్బంది పరీక్షలు నిర్వహించి, నేలలో ఉన్న పోషకలోపాలు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలు, ఏ పంటలు అనుకూలం వంటి వివరాలను తెలియజేస్తారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో అగ్రి ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామంటూ నర్సీపట్నంలోని భూసార పరీక్షా కేంద్రాన్ని ఐదేళ్ల క్రితం మూసివేసింది. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌లోనే భూసార పరీక్షలు చేస్తారని అప్పట్లో అధికారులు ప్రకటించారు. కానీ ఇది అందుబాటులోకి రాలేదు. దీంతో నర్సీపట్నం ప్రాంతంలో రైతులు సేకరించిన మట్టి నమూనాలను అనకాపల్లిలోని జిల్లా భూసార పరీక్షా కేంద్రానికి పంపించి పరీక్షలు చేయించాల్సి వస్తున్నది. దీని వల్ల ఫలితాలు రావడంలో జాప్యం అవుతున్నది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ మార్కెట్ యార్డులో గతంలో మూతపడిన భూసార పరీక్షా కేంద్రాన్ని పునఃప్రారంభించడానికి వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇది జరిగి ఏడాది కావస్తున్నప్పటికీ ఆమోదం లభించలేదు.

వ్యవసాయ శాఖ నర్సీపట్నం ఏడీ పరిధిలో ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు గత ఏడాది నర్సీపట్నం మండలంలో 912, గొలుగొండలో 850, రోలుగుంటలో 880, రావికమతంలో 1,210, వి.మాడుగులలో 1,390 మట్టి నమూనాలను సేకరించి రైతు సేవా కేంద్రాల ద్వారా అనకాపల్లిలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపించి పరీక్షలు చేయించారు. ఈ ఖరీఫ్ కూడా ఇలానే చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న భూముల్లో మట్టిన నమూనాలను సేకరిస్తున్నారు. వచ్చే నెలలో మిగిలిన భూముల్లో మట్టి నమూనాలు సేకరిస్తామని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

భూ సార పరీక్షల వల్ల ప్రయోజనాలు వున్నాయి. నేలలో సహజంగా ఉండే పోషకాల స్థాయిని తెలుసుకోచ్చు. వరినారు సిద్ధం చేసుకొని దమ్ము పట్టి నాట్లు వేయబోయే ముందు ఎంత మోతాదులో ఎరువులు వేయాలో తెలుస్తుంది. పరీక్షల లేకుండా మోతాదుకి మించి ఎరువులు వాడడం వల్ల పెట్టుబడి పెరిగి పోతుంది. అవసరానికి మంచి ఎరువులు వాడితే భూసారం మీద ప్రభావం పడుతుంది. అందువల్ల రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటుంటారు.

## మధ్యప్రాచ్యానికి పాక్షికంగా విమానాలు.. సేవలు పునరుద్ధరించిన భారతీయ విమానయాన సంస్థలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా మధ్యప్రాచ్యంలో గగనతల ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిలిచిపోయిన విమాన సర్వీసులను దేశీయ విమానయాన సంస్థలు ఇవాళ్టి నుంచి పాక్షికంగా పునరుద్ధరించాయి. ఇండిగో, ఎయిరిండియా, స్పైస్‌జెట్ వంటి సంస్థలు పరిమిత సంఖ్యలో మధ్యప్రాచ్యానికి రాకపోకలు ప్రారంభించాయి. విమానయాన సంస్థల వారీగా వివరాల్లోకి వెళితే... ఇండిగో ఇవాళ ఎనిమిది మధ్యప్రాచ్య గమ్యస్థానాలకు 17 విమానాలను (34 సెక్టార్లు) నడపనున్నట్లు తెలిపింది. సురక్షితమైన రీతిలో సర్వీసులను పూర్తిగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. సౌదీ అరేబియా, ఒమన్ గగనతలాలు తెరుచుకోవడంతో జెడ్డా, మస్కట్‌లకు విమానాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించాయి. మరోవైపు స్పైస్‌జెట్ ఉద్రిక్తతల నడుమ ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఈ నెల 6, 7 తేదీల్లో యూఏఈ నుంచి భారత్‌కు ప్రత్యేక విమానాలను, ఈ నెల 8న అదనపు సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించింది.సంస్థలు తమను నేరుగా సంప్రదించిన తర్వాతే ప్రయాణికులు విమానాశ్రయాలకు రావాలని ఇండిగో స్పష్టంగా సూచించింది. ఇక ఎయిరిండియా.. దుబాయ్, రాస్ అల్ ఖైమా, ఫుజైరా వంటి హబ్‌ల నుంచి ఇవాళ ప్రత్యేక విమానాలు నడిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇతర పశ్చిమాసియా గమ్యస్థానాలకు మార్చి 10 వరకు తమ షెడ్యూల్డ్ సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 8 మధ్య ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకున్న వారు ఎలాంటి అదనపు ఛార్జీలు, ఛార్జీల వ్యత్యాసం లేకుండా నెల రోజుల్లోగా తమ టికెట్లను రీబుక్ చేసుకోవచ్చని భరోసా ఇచ్చింది. విమానయాన పరిశ్రమ డేటా ప్రకారం ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 5 మధ్య మధ్యప్రాచ్యంలో 44,000 విమానాలు నడవాల్సి ఉండగా, ఇప్పటివరకు 25,000కు పైగా సర్వీసులు రద్దయ్యాయి. అయితే, దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రాఫిక్ సాధారణ స్థాయిలతో పోలిస్తే 25 శాతానికి చేరింది.




## ఉత్కంఠపోరులో ఇంగ్లాండ్‌పై విజయంతో

# ఫైనల్లో ప్రవేశించిన టీమిండియా




ఐసిసి టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు టీమిండియా వరుసగా రెండోసారి ప్రవేశించింది. వెస్టిండీస్, అమెరికా వేదికగా 2024లో జరిగిన టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరి టైటిల్‌ను కొట్టిన భారతజట్టు ముచ్చటగా మూడోసారి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 253పరుగుల భారీస్కోర్ నమోదు చేసినా.. టీమిండియాకు ఆషామాషీగా ఏం విజయం దక్కలేదు. ఇంగ్లండ్ ఓపెనర్ బేథెల్(105; 48బంతుల్లో 8ఫోర్లు, 7సిక్సర్లు) చివరి వరకు పోరాడుతూనే ఉన్నాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. బేథెల్ పోరాటం ఆగలేదు. ఇంగ్లండ్ విజయానికి చివరి ఓవర్లో 30పరుగులు కావల్సిన దశలో బేథెల్ రనౌటవ్వడం, ఆ తర్వాత బంతికి ఒక్క పరుగే రావడంతో టీమిండియాకు విజయం ఖాయమైంది. కాని చివరి 3బంతులను జోఫ్రా ఆర్చర్ సిక్సర్లు కొట్టినా.. అప్పటికే టీమిండియాకు గెలుపు లాంచనమే అయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు దక్కింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ నిర్ణయం బెడిసి కొట్టింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ(9) నిరాశపరిచినా.. వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ మరోసారి అదరగొట్టాడు. నిర్ణయాత్మక సూపర్-8 మ్యాచ్‌లో విండీస్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడి టీమిండియాను సెమీస్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించిన సంజు.. ఇంగ్లండ్ బౌలర్లకూ చుక్కలు చూపించాడు. కేవలం 42బంతుల్లోనే 8ఫోర్లు, 7భారీ సిక్సర్లతో 89పరుగులు చేసి టీమిండియా భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (39: 18బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు)తో కలిసి శాంసన్ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 97 పరుగులు జోడించారు. శివమ్ దూబే 25 బంతుల్లో 4 సిక్సర్లతో 43 పరుగులు చేయగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 11 పరుగులకే వెనుదిరిగాడు. చివర్లో హార్దిక్ పాండ్యా, యువ సంచలనం తిలక్ వర్మ విధ్వంసం సృష్టించారు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేయగా, తిలక్ వర్మ కేవలం 7 బంతుల్లోనే 3 భారీ సిక్సర్లతో సహా 21 పరుగులతో రాణించాడు. జోఫ్రా ఆర్చర్‌కి తోడు విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి ఏకంగా 253 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.

ఛేదనలో భాగంగా ఇంగ్లండ్‌కు శుభారంభం దక్కలేదు. సాల్ట్(5), కెప్టెన్ బ్రూక్(7), బాటన్(17) నిరాశపరిచినా.. బట్లర్(25)కి తోడు బేథెల్ (105) సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. చివరి 4ఓవర్లను టీమిండియా బౌలర్లు కట్టడిగా వేసినా.. కేవలం 7పరుగుల తేడాతో మాత్రమే ఇంగ్లండ్ ఓటమిపాలైంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారతజట్టు న్యూజిలాండ్‌తో తల పడనుంది. టీమిండియా బౌలర్లు హార్దిక్ పాండ్యాకు రెండు, బుమ్రా, ఆర్ష్‌దీప్, అక్షర్, వరుణ్‌కి ఒక్కో వికెట్ దక్కాయి.

## అంతర్జాతీయ క్రికెట్‌లో 500 వికెట్లు పూర్తి చేసుకున్న బుమ్రా



టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 500 వికెట్లు పూర్తి చేసుకున్న బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఇంగ్లండ్‌తో టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్ మ్యాచ్‌లో బుమ్రా ఈ ఘనత సాధించాడు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా.. తాను వేసిన తొలి బంతికే ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను అవుట్ చేయడం ద్వారా 500వ వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ వికెట్‌తో అనిల్ కుంబ్లే, రవిచంద్రన్ అశ్విన్, హర్భజన్ సింగ్, కపిల్ దేవ్, జహీర్ ఖాన్, రవీంద్ర జడేజా, జవగల్ శ్రీనాథ్ సరసన బుమ్రా చేరాడు. ఈ ఘనత సాధించిన ఎనిమిదో భారత బౌలర్‌గా ఆయన చరిత్రకెక్కాడు. 2016 జనవరిలో ఆస్ట్రేలియాపై అంతర్జాతీయ అరంగేట్రం చేసిన బుమ్రా.. ఇప్పటివరకు అన్ని ఫార్మాట్లలో కలిపి నిలకడగా రాణిస్తున్నాడు. 32 ఏళ్ల ఈ అహ్మదాబాద్ పేసర్ ఇప్పటివరకు 52 టెస్టుల్లో 234, 89 వన్డేల్లో 149, 94 టీ20ల్లో 117 వికెట్లు పడగొట్టి తన సత్తా చాటాడు.

సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టులో బుమ్రా కీలక అస్త్రంగా మారాడు. ప్రస్తుత ప్రపంచకప్‌లో ఇప్పటివరకు 6 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు తీశాడు. సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లపై అద్భుతంగా రాణించడమే కాకుండా, గత నెలలో కొలంబో వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో తన మొదటి ఓవర్‌లోనే ఇద్దరు బ్యాటర్లను (సయం అయూబ్, సల్మాన్ అలీ ఆఘా) పెవిలియన్‌కు పంపి సంచలనం సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ బుమ్రా కొనసాగుతున్నాడు.




# రష్మికకు 90 కోట్ల విల్లా నిజమేనా?



టాలీవుడ్‌లో తొమ్మిదేళ్లుగా ప్రేమ ప్రయాణం సాగించి, ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక మందన జంటకు సంబంధించిన ప్రతీ వార్త సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలుస్తోంది. వీరి పెళ్లి వేడుకల సందడి ఇంకా ముగియకముందే, రష్మికకు అత్తింటి నుంచి అందిన కానుకలపై ఆసక్తికర చర్చ మొదలైంది. తాజాగా భార్య రష్మికకు విజయ్ దేవరకొండ ఏకంగా 90 కోట్ల రూపాయల విలువైన లగ్జరీ విల్లాను పెళ్లి కానుకగా ఇచ్చారంటూ ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. వివరాల్లోకి వెళితే... పెళ్లి తర్వాత కోడలిగా అడుగుపెట్టిన రష్మికకు విజయ్ తల్లి మాధవి తమ కుటుంబానికి చెందిన వారసత్వ గాజులను బహూకరించారు. ఈ సెంటిమెంట్ గిఫ్ట్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే, విజయ్ తన భార్యకు వ్యక్తిగతంగా ఓ భారీ కానుక ప్లాన్ చేశారనే ప్రచారం ఊపందుకుంది. హైదరాబాద్‌లో అన్ని సౌకర్యాలతో కూడిన ఓ విలాసవంతమైన విల్లాను రష్మిక పేరు మీద కొనుగోలు చేసి బహుమతిగా ఇచ్చారని, దాని విలువ సుమారు రూ.90 కోట్లు ఉంటుందని సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. పెళ్లి తర్వాత ఇచ్చే తొలి కానుక ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉండాలనే ఉద్దేశంతోనే విజయ్ ఈ ఖరీదైన గిఫ్ట్ ఎంచుకున్నారని అంటున్నారు. అయితే, ఈ వార్తలపై దేవరకొండ కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

'గీత గోవిందం' సినిమా సెట్స్‌లో మొదలైన వీరి స్నేహం, 'డియర్ కామ్రేడ్' నాటికి ప్రేమగా మారింది. సుదీర్ఘకాలం పాటు డేటింగ్ చేసిన తర్వాత కుటుంబ సభ్యుల అంగీకారంతో ఈ జంట ఒక్కటైంది. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడిన విజయ్, మొదట రష్మికనే తనకు ప్రపోజ్ చేసిందనే ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. ప్రస్తుతం విజయ్ తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని విలాసవంతమైన ఇంట్లో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త విల్లా బహుమతి వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే. మొత్తానికి, పెళ్లి తర్వాత కూడా 'విరోష్' జంట వార్తలతో అభిమానులను అలరిస్తూనే ఉంది.

# జాన్వీకు రామ్ చరణ్ స్పెషల్ బర్త్ డే విషెస్



ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. వీరిద్దరూ జంటగా నటిస్తున్న చిత్రం 'పెద్ది'. జాన్వీ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన బిహైండ్ ది సీన్స్ (బీటీఎస్) దృశ్యాలను చరణ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ వీడియోలో జాన్వీ తన పాత్ర 'అచ్చియమ్మ' గెటప్‌లో కనిపిస్తూ సందడి చేశారు.

షూటింగ్ సమయంలో చరణ్, జాన్వీ ఇతర టీమ్ మెంబర్స్‌తో సరదాగా గడుపుతున్న లైట్ హార్టెడ్ మూమెంట్స్ ఈ వీడియోలో హైలైట్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా చరణ్ స్పందిస్తూ.. "మా అచ్చియమ్మ, ఎంతో హుందాగా ఉండే జాన్వీ కపూర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. తన వృత్తి పట్ల ఆమెకున్న ప్యాషన్, నిబద్ధత చూడటం చాలా సంతోషంగా ఉంది. ఈ ఏడాది తనకి అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని రాసుకొచ్చారు.

వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నాయి. రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రత్నవేలు సినిమాటోగ్రఫీ, నేషనల్ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చూస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయనున్నారు.

మరోవైపు జాన్వీ సోదరి ఖుషీ కపూర్ కూడా కొన్ని అన్ సీన్ ఫోటోలను షేర్ చేస్తూ ఎమోషనల్ అయ్యారు. "నా బెస్ట్ ఫ్రెండ్, నా టీచర్, నేను ఈ రోజు ఇలా ఉండటానికి కారణం నువ్వే.. నువ్వు లేకుండా నేను లేను" అంటూ అక్కపై ప్రేమను చాటుకున్నారు. ఇక 'సన్నీ సంస్కారి కి తులసి కుమారి' చిత్రంలో జాన్వీతో నటిస్తున్న వరుణ్ ధావన్ ఫన్నీగా విష్ చేశారు. "నాకంటే నువ్వు వయసులో చాలా పెద్దదానివైనా.. నా లైఫ్ లో ఉన్నందుకు ఆనందంగా ఉంది. ఎప్పుడూ సంతోషంగా ఉంటూ, సక్రమంగా ట్యాక్సులు కట్టాలని కోరుకుంటున్నా" అంటూ ఇన్ స్టా స్టోరీలో జాన్వీని సరదాగా ఆటపట్టించారు.

# పెళ్లి పీటలు ఎక్కబోతున్న హీరో బెల్లంకొండ శ్రీనివాస్



యాక్షన్ చిత్రాలతో వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ నెల మార్చి 8న ఆయన నిశ్చితార్థ వేడుక జరగనుంది. గత కొన్నేళ్లుగా ఒక యువతితో ప్రేమలో ఉన్న శ్రీనివాస్, ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో తన స్నేహితురాలిని పెళ్లాడబోతున్నాడు. ఈ వేడుకను అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో చాలా ప్రైవేట్‌గా నిర్వహించనున్నట్టు సమాచారం. వధువు వివరాలను ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే ఈ జంట పెళ్లి పీటలు ఎక్కాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ వార్త బయటకు రావడంతో బెల్లంకొండ అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**